క్లుప్తంగా

భగవద్గీత పఠనంతో పరిపూర్ణ జ్ఞానం



భగవద్గీత ప్రాముఖ్యతను వివరిస్తున్న జ్ఞానకీర్తన

విజయనగరం: భగవద్గీత గ్రంథాన్ని ప్రతి ఒక్కరూ చదివి పరిపూర్ణమైన జ్ఞానాన్ని పొందాలని పట్టణానికి చెందిన తిరుమలరాజు జ్ఞానకీర్తన పేర్కొన్నారు. సోమవారం స్థానిక బాలాజీ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని భగవద్గీతలోని అంశాలను వివరించారు. ఆత్మ, శరీరం వేరు వేరు అనే విషయాన్ని తెలుసుకుంటే జీవితం పరిపూర్ణమవుతుందన్నారు. అనంతరం బాలాజీ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో వాకర్స్ గవర్నర్ కర్రోతు సత్యం, క్లబ్ అధ్యక్షుడు రామరాజు, కార్యదర్శి నాగలక్ష్మి, కృష్ణంరాజు, సుబ్బరాజు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రావివలసలో భూముల రీసర్వే



భూమల రీసర్వేను ప్రారంభిస్తున్న సర్పంచ్ ఉప్పాడ శివారెడ్డి

భోగాపురం: మండలంలోని అమటాం రావివలస పంచాయతీ పరిధిలో రైతులకు సంబంధించిన భూముల్లో రెవెన్యూ అధికారులు సోమవారం భూముల రీసర్వే చేపట్టారు. సర్పంచ్ ఉప్పాడ శివారెడ్డి భూముల రీసర్వేను ప్రారంభించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ మధుసూదనరావు, డ్రోన్ ఆపరేటర్ దేముదుబాబు, రెవెన్యూ సిబ్బంది కుమార్, ప్రసన్న, సెక్రటరీ స్వర్ణ, మహిళా పోలీస్ రీనాపాల్, ఉపసర్పంచ్ నడుపూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా డీసీఎంఎస్‌లు

విజయనగరం ఫోర్ట్: రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను అందించడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ చేయడం, రైతులకు అండగా నిలవడమే డీసీఎంఎస్ ప్రధాన లక్ష్యమని చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన అన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. రైతన్నల అభ్యున్నతికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారన్నారు. విత్తనం నుంచి విక్రయం వరకు అన్నీ ప్రభుత్వమే బాధ్యత వహించే విధంగా చర్యలు చేపట్టారన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌కు రైతులకు 1121, సోనామసూరి, సాంబమసూరి, ఫౌండేషన్, మొక్కజొన్న విత్తనాలు (నాన్ సబ్సిడీ)పై అందించనున్నట్లు చెప్పారు. ఈ నెల 31 నుంచి విజయనగరం, బొబ్బిలి డీసీఎంఎస్ కార్యాలయాల్లో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచుతామన్నారు.


ప్రపంచ శాంతిని ఆకాంక్షిస్తూ..



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న క్రీస్తు ఆరాధకులు

విజయనగరం టౌన్: ప్రపంచ శాంతిని ఆకాంక్షిస్తూ దేశ సౌభ్రాతృత్వాన్ని పెంపొందించే విధంగా క్రైస్తవ సోదరులందరూ ప్రత్యేక ప్రార్థనలు చేయడం ఆనందదాయకమని పీటీసీ ప్రిన్సిపాల్ టి.ఆనందబాబు అన్నారు. కంటోన్మెంట్ సీఎస్ఐ చర్చి గ్రౌండ్స్‌లో సోమవారం రాత్రి ప్రపంచ ప్రార్థనా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా రెవరెండ్ ప్రమోద్ కుమార్ దైవసందేశాన్ని వినిపించారు. పాస్టర్లు డాక్టర్ పి.ప్రేమానందం, డి.జాన్‌మోజెస్, డాక్టర్ ఎం.ఐజక్, ఎం.పాల్సన్, బిషప్ వి.సుకుమార్, ప్రశాంతబాబు, డాక్టర్ బి.ఉదయ్ చంద్రలు, పట్టణ పాస్టర్ల కమిటీ సభ్యులు రెవరెండ్ ఎస్.మధు, స్టీఫెన్‌పాల్, వివేక్, యబ్బోజు చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల ధర్నా



దర్నా చేస్తున్న దివ్యాంగులు

విజయనగరం ఫోర్ట్: కొత్తగా ఏర్పాటైన జిల్లాల్లో దివ్యాంగుల సంక్షేమ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని దివ్యాంగ హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్షుడు ఎస్.శ్రీనివాస్‌రావు అన్నారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివాహ ప్రోత్సాహక బహుమతితో పాటు రూ.5 లక్షల రుణం మంజూరు చేయాలని కోరారు. దివ్యాంగులకు తొలిగించిన పింఛన్లు ఎటువంటి షరతులు లేకుండా మంజూరు చేయాలని, అంత్యోదయ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రామలక్ష్మి, వి.సూర్యారావు, కె.పైడినాయుడు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్‌లో చంద్రబాబుకు శ్మశానాలే దిక్కు

- ఎన్నికలు సమీపిస్తుండటంతో ఆల్ ఫ్రీ మేనిఫెస్టో ప్రకటన
- చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసనగా వైఎస్సార్‌సీపీ శ్రేణుల బైక్ ర్యాలీ



వైఎస్సార్‌సీపీ నాయకుల బైక్ ర్యాలీ



వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

విజయనగరం: పేదల సొంతింటి కలను సాకారం చేయాలనే సత్సంకల్పంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తే వాటిని సమాధులుగా వక్రీకరించిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు, టీడీపీకి భవిష్యత్‌లో శ్మశానాలే దిక్కని వైఎస్సార్‌సీపీ విజయనగరం నగర అధ్యక్షుడు ఆశపు వేణు, మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు మండిపడ్డారు. చంద్రబాబు వాఖ్యలను ఖండిస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం నగరంలో భారీగా బైక్ ర్యాలీ నిర్వహించారు. రింగ్‌రోడ్‌లోని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నివాసం వద్ద ఎంపీపీ మామిడి అప్పలనాయుడు జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించారు. బాలాజీ జంక్షన్, సింహాచలం మేడ, కోట జంక్షన్, డీసీసీబీ రోడ్, మూడు లాంతర్ల జంక్షన్, మెయిన్‌రోడ్, గంటస్తంభం జంక్షన్, కన్యకాపరమేశ్వరి ఆలయ జంక్షన్, ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ మీదుగా వైఎస్సార్ సర్కిల్ వరకు ర్యాలీగా వెళ్లి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం చంద్రబాబు వాఖ్యలను ఖండిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. చంద్రబాబుకు మతి భ్రమించిందని, అధికారం కోసం పగటి కలలు కంటూ కల్లబొల్లి మాటలు చెబుతున్నారని విమర్శించారు. ఆయన కలలు కలలుగానే మిగిలిపోతాయని, రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లోనూ వైఎస్సార్‌సీపీ విజయం సాధించటం ఖాయమని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో సుమారు 30 లక్షల మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేసిందని, టీడీపీ ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన టిడ్కో ఇళ్లను కూడా పూర్తిచేసి లబ్ధిదారులకు అందిస్తోందని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన చంద్రబాబు, ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తుండడంతో ఆల్ ఫ్రీ మేనిఫేస్టోను విడుదల చేశారని విమర్శించారు. వచ్చే ఎన్నికల తర్వాత టీడీపీ నామరూపాలు లేకుండా పోతుందని, చంద్రబాబు బృందానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌ఛార్జిలు, కార్పొరేటర్లు, యువజన, విద్యార్థి విభాగాల నాయకులు, పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెత్తందారులపై గెలుపునకు నాలుగేళ్లు

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే బడ్డుకొండ

భోగాపురం: పెత్తందారుల బానిస సంకెళ్ల నుంచి ప్రజలను విముక్తులను చేసేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా పార్టీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయరెడ్డి, పార్టీ శ్రేణులతో కలిసి సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. మండలంలోని పోలిపల్లి గ్రామం నుంచి రాజాపులోవ, లింగావలస, సవరవిల్లి, రాయివలస మీదుగా భోగాపురం వరకు సుమారు 14 కిలోమీటర్లు మేర ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు, ఎల్లో మీడియా, దత్తపుత్రుడు కలిసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ ప్రభుత్వం అమరావతిలో సుమారు 50 వేలమందికి పైగా పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తే.. వాటిని శ్మశానాలతో పోల్చిన చంద్రబాబుకు పుట్టగతులు ఉండవన్నారు. చంద్రబాబు తన హయంలో పేదలకు ఎక్కడైనా సెంటు భూమి ఇచ్చారా అని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీలను గాలికొదిలేసి, ఇప్పుడు అధికారం కోసం లేనిపోని హామీలను ఇస్తున్నారని, చంద్రబాబు హామీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. సీఎం జగన్ అధికారం చేపట్టిన నాలుగేళ్లలోనే 99 శాతం ఎన్నికల హామీలను అమలు చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, ప్రజాప్రతినిధులు ఉప్పాడ శివారెడ్డి, పడాల శ్రీనివాసరావు, సుందర హరీష్, పడాల భానుప్రకాశ్, మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, దంతులూరి రావాడబాబు, కర్రోతు వెంకటరమణ, పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న సంతకం సుపరిపాలనకు సంకేతం

- వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ డీవీజీ

విజయనగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతీ సంతకం సుపరిపాలనకు సంకేతాలేనని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జోనల్ ఇన్‌ఛార్జి, మాజీ ఎంపీ డాక్టర్ డీవీజీ శంకరరావు అన్నారు. గొప్ప పనులు మొదట పరిహసింప బడతాయని చివరలో అనుకరింప బడతాయన్న విషయం టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన తాజా మేనిఫేస్టో ద్వారా వెల్లడైందన్నారు. ఏ పథకాలనైతే ఆచరణ సాధ్యం కావని పరిహసించారో, పేదల్ని సోమరులు చేసే విధానాలంటూ వ్యతిరేకించారో వాటినే.. అంతకుమించి అన్నట్లు టీడీపీ మేనిఫెస్టోలో పొందుపర్చడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గత నాలుగేళ్లలో 98 శాతానికి పైగా హామీలను అమలు చేసిందని గుర్తుచేశారు. నాలుగేళ్ల క్రితం వరకు వైఎస్ జగన్ కేవలం పోరాట యోధుడు మాత్రమేనని, సీఎం అయ్యాక ప్రజా సంక్షేమం, రాష్ట్ర ప్రయోజనాలు, అభివృద్ధికి ఊతమిస్తూ అనేక కార్యక్రమాలు అమలు చేశారని, అవన్నీ సుపరిపాలనకు చెరగని సంకేతాలుగా నిలిచిపోతాయని అన్నారు. నాలుగేళ్లలో ఎన్ని కష్టాలు ఎదురైనా సంక్షేమ పథకాలు ఎన్నడూ నిలిచిపోలేదని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

వలంటీర్లు సంక్షేమ వారధులు



నెల్లిమర్ల: వలంటీర్లను సత్కరిస్తున్న చిక్కాల సాంబశివరావు, తదితరులు



నెల్లిమర్ల రూరల్: సత్కారం పొందిన వలంటీర్లతో వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు



డెంకాడ: సన్మానం పొందిన వలంటీర్లతో ప్రజాప్రతినిధులు, అధికారులు

నెల్లిమర్ల: వలంటీర్లు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులని నగరపంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు అన్నారు. నగరపంచాయతీ పరిధి జరజాపుపేటలో సేవలందిస్తున్న వార్డు వలంటీర్లను సోమవారం సేవా పురస్కారాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో వలంటీర్లు చురుకైన పాత్ర వహిస్తున్నారన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలని కోరారు. వైస్ చైర్మన్ సముద్రపు రామారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్, స్థానిక కౌన్సిలర్లు పొంద్రంకి సత్యవతి, తుమ్ము భారతి, నల్లి కృష్ణవేణి, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిల వాసు, కో ఆప్షన్ మెంబరు మాత సంధ్య, నల్లి శ్రీనివాసరావు, పొంద్రంకి సత్యనారాయణ, కనకల హైమావతి, ఎంఎం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం

నెల్లిమర్ల రూరల్: గ్రామ వలంటీర్ల సేవలు అభినందనీయమని టూరిజం కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని సీతారామునిపేటలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేస్తూ ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు చేరవేయడంలో వలంటీర్లు కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. అనంతరం సీతారామునిపేటతో పాటు గొర్లిపేట, కొత్తపేట వలంటీర్లను ఘనంగా సత్కరించి పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పతివాడ గౌరి, శ్రీను, నాయకులు రాంబార్కి రామారావు, పరిసినాయుడు, వైస్ సర్పంచ్ పిన్నింటి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సేవలకు దక్కిన గౌరవం

డెంకాడ: వలంటీర్ల సేవలకు తగిన గౌరవాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు అన్నారు. మండలంలోని చొల్లంగిపేట సచివాయలంలో చొల్లంగిపేట, డి.కొల్లాం, గుణుపూరుపేట, గుణుపూరు పంచాయతీలకు చెందిన గ్రామ వలంటీర్లను సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు బడుకొండ లక్ష్మి, సర్పంచ్‌లు కోరాడ కనకరాజు, అట్టాడ కృష్ణ, పైల ముత్యాలరావు, ఎంపీటీసీ గుడివాడ కిరణ్, వైఎస్సార్‌సీపీ నాయకులు మండల సత్యం, రామునాయుడు, చిట్టిరాజు, తొత్తడి శ్రీను, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

క్షతగాత్రుడి వైద్యానికి జెడ్పీ చైర్మన్ సాయం

విజయనగరం గంటస్తంభం: పాలకొండ మండలం ఎం.సింగుపురం సచివాలయంలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న బి.రాజ్‌కుమార్ ఆదివారం రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలతో శ్రీకాకుళం రిమ్స్‌లో చేరగా మల్టీ ఫ్యాక్చర్ అయిన కారణంగా నిన్న రాత్రి విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. ఈ విషయం పార్వతీపురం మన్యం జిల్లా అగ్రికల్చర్ అధికారి జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు దృష్టికి తీసుకురాగా ఆయన వెంటనే స్పందించి జెడ్పీ సాధారణ నిధుల నుంచి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.25 వేలు నగదు ఆర్‌టీజీఎస్ ద్వారా రాజ్‌కుమార్ కుటుంబ సభ్యుల ఖాతాకు బదిలీ చేశారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులను కోరారు.

పోలీస్ స్టేషన్‌లో తనిఖీలు

కొత్తవలస: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు సోమవారం తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట సీఐ ఎస్.బాలసూర్యారావు తదితరులు ఉన్నారు.

31న ఇసుక వేలం

చీపురుపల్లి: అక్రమ రవాణా కేసులో సీజ్ చేసిన ఇసుకను జూనియర్ సివిల్ జడ్జి ఆదేశాల మేరకు ఈ నెల 31న తహసీల్దార్ సమక్షంలో బహిరంగ వేలం వేయనున్నట్లు ఎస్ఐ ఏ.సన్యాసినాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 మే 19న గొల్లలపాలెం గ్రామ పరిధిలో రెండు అక్రమ ఇసుక డంప్‌లను గుర్తించి కేసు నమోదు చేసి, ఇసుకను సీజ్ చేశామని పేర్కొన్నారు. 31వ తేదీ ఉదయం 11 గంటలకు గొల్లలపాలెంలో వేలం వేయనున్నామని, ఆసక్తి ఉన్న వారు పాల్గొన వచ్చని సూచించారు.

1న క్యాంపస్ ఇంటర్వ్యూలు

కొత్తవలస: డెక్కన్ ఫైన్ కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఉద్యోగాలకు స్థానిక వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల ఆవరణలో జూన్-1వ తేదీన క్యాంపస్ ఇంటర్వ్యూ లు (ప్రాంగణ ఎంపికలు) నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ మహేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2017-2023 మధ్య బీఎస్సీ, ఎంఎస్సీ కెమిస్ట్రీ పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు 95501 31930, 90145 76033 నంబర్లకు ఫోన్‌లో సంప్రదించాలని సూచించారు.

నవధాన్యాల విత్తనాల పంపిణీ



నవధాన్యాల కిట్లు పంపిణీ చేస్తున ఎమ్మెల్సీ రఘురాజు,తదితరులు

శృంగవరపుకోట: ప్రభుత్వం రాయితీపై ఇచ్చే నవధా న్యాల విత్తనాలను రైతులు సద్వినియోగంచేసుకోవాలని ఎమ్మెల్సీ రఘురాజు కోరారు. సంతగైరమ్మపేటలో రైతులకు నవధాన్యాల విత్తనాలను సో మవారం ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సోమేశ్వరరావు, జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ సుధారాజు, సర్పంచ్ గోగాడ కళావతి వార్డుమెంబర్లు పాల్గొన్నారు.

షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం

కృష్ణాపురంలో షిర్డీసాయిబాబా ఆలయ వార్షికోత్స వం శనివారం నిర్వహించారు. ఎమ్మెల్సీ రఘు రాజు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధనలో భక్తులకు వడ్డన చేశారు.

టీడీపీది మేనిఫెస్టో కాదు మాయాఫెస్టో

- వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ అవనాపు విక్రమ్



మాట్లాడుతున్న అవనాపు విక్రమ్

విజయనగరం: టీడీపీది మేనిఫెస్టో కాదు.. ప్రజలను మోసం చేసే మాయాఫెస్టో అని వైఎస్సార్ సీపీ యూత్ వింగ్ జోనల్ ఇన్‌చార్జ్ అవనాపు విక్రమ్ అన్నారు. 2014 ఎన్నికల్లో 600పైగా హామీలు ఇచ్చినచంద్రబాబు పట్టుమని 10 శాతం హామీలను కూడా నెరవేర్చలేదని విక్రమ్ గుర్తుచేశారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజలను దగా చేయడానికి చంద్రబాబు ఆరు అబద్ధాల హామీలను ప్రకటించారని ఆరోపించారు. చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పథకాలను, కర్ణాటక కాంగ్రెస్ మేనిఫెస్టోను కాపీ కొట్టారని ఆరోపించారు. రూ.87వేల కోట్లు రైతుల రుణమాఫీ చేస్తానని చెప్పి రాష్ట్ర జనాభాలో 60శాతం ఉన్న రైతులను మోసం చేసిన చంద్రబాబు ఈరోజు ఏడాదికి రూ.20వేలు రైతులకు ఇస్తానని ప్రకటిస్తే ఎవరైనా నమ్ముతారా అని ప్రశ్నించారు. ఇంటికో ఉద్యోగం అని చెప్పి గతంలో కోటి 50లక్షల కుటుంబాలను మోసం చేసిన వ్యక్తి చంద్రబాబు అని, అలాంటి వ్యక్తి నేడు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తానంటే యువత నమ్మే పరిస్థితి లేదన్నారు. నిరుద్యోగ యువతకు రూ.2వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి ఎగ్గొట్టిన చంద్రబాబు నేడు రూ.3వేలు ఇస్తామన్న ప్రకటన చూసి యువత నవ్వుకుంటున్నారన్నారు. డ్వాక్రా రుణమాఫీ అని చెప్పి 80లక్షల మంది అక్కా చెల్లెమ్మలను మోసం చేసిన చరిత్ర చంద్రబాబుదని విక్రమ్ మండిపడ్డారు.

ప్లాస్టిక్ నిషేధంతో పర్యావరణానికి మేలు



పాత బస్టాండ్ సమీపంలో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది

విజయనగరం రూరల్: పర్యావరణానికి హానిచేసే ప్లాస్టిక్ వస్తువులను నిషేధిద్దామని, అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పర్యావరణ ఇంజినీర్ టి.సుదర్శనం అన్నారు. 'మిషన్ లైఫ్' కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్పొరేషన్ సమీపం, పాత బస్టాండ్ వద్ద సోమవారం పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ సుదర్శనం మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. దీన్ని పూర్తిగా నిషేధించాలని పిలుపునిచ్చారు. ఈ-వ్యర్థాలను తగ్గించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. మొక్కలను నాటితే జీవవైవిధ్యానికి ఎంతో మేలు కలుగుతుందన్నారు. సేంద్రియ విధానంలో పంటలు సాగు చేయడం ద్వారా పర్యావరణానికి, రైతులకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి, మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆద్యంతం.. అమోఘం



నాటకంలో సన్నివేశం

విజయనగరం టౌన్: పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు శతజయంతి ఉత్సవాలు స్థానిక గురజాడ కళాభారతి ఆడిటోరియంలో సోమవారం రాత్రి ఘనంగా జరిగాయి. ఘంటసాల స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో తెలంగాణా రాష్ట్రం స్టేషన్ ఘనాపూర్‌కి చెందిన శ్రీసాయి సంతోషి నాట్యమండలి (సురభి) నిర్వహణ బాధ్యతలు చేపట్టారు. భాస్కరుని సత్య జగదీష్ రచన దర్శకత్వంలో సురభి సంతోష్ నిర్వహణలో కళాకారులు ఘంటసాల నాటకాల్లోని పలు సన్నివేశాలను అద్భుతంగా ప్రదర్శించారు. ఘంటసాల పాడిన ఆపాత మధురాలను ఆలపించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి హాజరై ఆద్యాంతం నాటికను తిలకించారు. కార్యక్రమంలో ఘంటశాల స్మారక కళాపీఠం వ్యవస్థాపకులు ఎం.భీష్మారావు, ధవళ సర్వేశ్వరరావు, వైవీవీ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అధికారం కోసం అడ్డదారులు



నిరసన ప్రదర్శనలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లి: ఎన్నికలకు కొద్ది కాలం మాత్రమే ఉండడంతో అధికార దాహంతో చంద్రబాబునాయుడు అన్నీ ఫ్రీగా ఇచ్చేస్తానంటూ తాను ఆల్ ఫ్రీ బాబునే అంటూ ప్రజలను మరోసారి మోసం చేసేందుకు బయలుదేరాడని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు విమర్శించారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు ఇచ్చే ఇంటి స్థలాలు శవాన్ని పూడ్చడానికి సరిపోతుందని చంద్రబాబునాయుడు కించపరిచే వ్యాఖ్యలను నిరసిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల మండలాలకు చెందిన పార్టీ శ్రేణులు, ఇళ్ల లబ్ధిదారులు కలిసి నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు ప్రజలు చంద్రబాబుకు అధికారం ఇస్తే 2014లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిన సంగతి ప్రజలకు గుర్తుందన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నంత కాలం పెత్తందారుల కోసమే పని చేశారన్నారు. ఎన్నికల ముందు హామీలు ఇవ్వడం అధికారంలోకి వచ్చాక పేదలను మరిచిపోవడం చంద్రబాబుకు అలవాటేనన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 32 లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్ల కట్టించి ఇచ్చారని, తాజాగా అమరావతిలో ఒకేరోజు 52 వేల మంది పేదలకు ఇళ్ల స్థల పట్టాలు పంపిణీ చేశారని చెప్పారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న మూడు సార్లు ఎప్పుడైనా ఇంత పెద్దస్థాయిలో సంక్షేమ పథకాలు అమలు చేశారా అని ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలోని గుంకలాంలో అతి పెద్ద లేఅవుట్ ఏర్పాటు చేసి సుమారు 15 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పలాస నియోజకవర్గ పరిశీలకుడు కె.వి.సూర్యనారాయణరాజు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, ఏఎంసీ చైర్మన్ దన్నాన జనార్దనరావు, గుర్ల, గరివిడి జెడ్పీటీసీలు శీర అప్పలనాయుడు, వాకాడ శ్రీనివాసరావు, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ బెల్లాన బంగారు నాయుడు, చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల మండల నాయకులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం వేలం

గజపతినగరం: పలు అక్రమ రవాణా కేసుల్లో పోలీసులు సీజ్ చేసిన 229.40 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యానికి గజపతినగరం ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద ఈనెల 31న వేలం వేయనున్నట్లు సీఎస్‌డీటీ రవిశంకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం మధ్యాహ్నం ప్రారంభం కానున్న వేలం పాటలో ఆసక్తి గల వారు పాల్గొనవచ్చని సూచించారు.

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

జామి: మండలంలోని భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ వద్ద ఉన్న కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అయిదురోజుల పాటు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభం కానున్నాయి. పాలకమండలి సభ్యులు ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు.మంగళవారం స్వామి వారికి పంచామృతాభిషేకాలు, అంకురార్పణ, 31న స్వామివారి కల్యాణం, జూన్ 1న శ్రీవారి గరుడసేవ, 2న స్వామివారి తులాభారసేవ, 3న దొంగల దోపిడి ఉత్సవం,4న వసంతోత్సవం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ పాలకమండలి సభ్యులు సోమవారం తెలిపారు.

నేడు సూర్యనారాయణస్వామి కల్యాణం

మెరకముడిదాం: మండలంలోని సోమలింగాపురం గ్రామంలో సూర్యనారాయణమూర్తి, ఉమా సోమలింగేశ్వరస్వామి వార్ల ఆలయంలో సూర్యనారాయణ స్వామి కల్యాణం మంగళవారం నిర్వహించనున్నట్టు ఆలయ ప్రధాన అర్చకుడు ఆరవెల్లికృష్ణ శాస్త్రి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళ్యాణ మహోత్సవాన్ని ఆలయ అనువంశిక ధర్మకర్త, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు ఆధ్వర్యంలో ఉదయం స్వామివార్లకు ప్రత్యేక పూజలు, సాయంత్రం కల్యాణం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

రెండు రోజుల పాటు శివాలయ వార్షికోత్సవం

వేపాడ: మండలంలోని బానాది శివాలయం వార్షికోత్సవం మంగళవారం, బుధవారం రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకులు, మేడపాటి కిశోర్ శర్మ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం రాత్రి పార్వతీపరమేశ్వర్ల కల్యాణం, బుధవారం ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.